ప్రజాశక్తి
మంగళవారం 29 ఏప్రిల్, 2025 5
శ్రీకాకుళం

పాతపట్నంలో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

పాతపట్నం : మండలంలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి దట్టమైన మేఘాలు కమ్మి ఉరుములతో, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం పడడంతో స్థానిక కోర్టు కూడలి వద్ద విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగిపడడంతో వైర్లు తెగిపోయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పాతపట్నం పట్టణంలో అంధకారం నెలకుంది. పంగలంతా ప్రజలు ఎండలతో, ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఈ వర్షం వల్ల కాస్త ఉపశమనం కలిగింది.

బేవరీస్ హమాలీల

సమస్యను పరిష్కరించాలి

- డిపిఒ కార్యాలయ ఉద్యోగులపై ఫిర్యాదు
- 'మీకోసం'కు 165 వినతులు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వివరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని ఎచ్చెర్ల కేంద్రంగా నిర్వహిస్తున్న ఎపి బెవరేజ్ కార్పొరేషన్ డిపో హమాలీల ఉపాధిని కాపాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.బంగార్రాజు, ఎన్.రమణ, ఎల్.లక్ష్మణరావు, డి.రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం)లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌లను కలిసి వినతిపత్రం అందచేశారు. ఎచ్చెర్లలో వంద మంది దళిత కుటుంబాలకు చెందిన నాలుగు ఎకరాలు భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం యారక్ బాటిలింగ్ యూనిట్ నెలకొల్పడానికి తీసుకుందని, అందులో భూములు ఇచ్చిన దళిత కుటుంబాలకు కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి కల్పించినట్టు వివరించారు. తర్వాత పరిణామాల్లో సారా తయారీని నిలుపుదల చేసిన తర్వాత ఐఎంఎల్ డిపోగా మార్చి హమాలీలను మాత్రమే కొనసాగించారని అన్నారు. ఇప్పుడు డిపోను టెక్కలి మార్చేందుకు ఎక్సైజ్ అధికారులు చేస్తున్న ప్రయత్నం వల్ల హమాలీలకు ఉపాధి కోల్పోవస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి మేటి కవులుగా ఖ్యాతి గడించిన గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులు వంటి వారి జయంతులను అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు కోరారు.

ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరుకు చెందిన సూర్యనారాయణ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఉద్యోగులపై ఫిర్యాదు అందజేశారు. రూ.1.60 లక్షల నిధులు దుర్వినియోగమైనట్టు డిఎల్‌పిఒ, డెప్యూటీ ఎంపిడిఒలు నివేదికలు ఇచ్చినా సర్పంచ్‌లపై చర్యలు తీసుకోకుండా అక్కడ పనిచేస్తున్న ఎఒ అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే విచారణ చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులో అన్యాయంగా స్థలాన్ని ఆక్రమించుకుని తప్పుడు పత్రాలతో కార్పొరేషన్ అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నారని లోతుగెడ్డ కృష్ణవేణి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. జిల్లా వ్యాప్తంగా వ్యక్తిగత, సామాజిక సమస్యలతో కూడిన 165 వినతులు వచ్చాయి. వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వివిధ శాఖాధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డిఆర్ఒ వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

వికలాంగులకు స్మార్ట్‌ఫోన్లు అందజేత

వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు వికలాంగులకు కలెక్టర్ స్మార్ట్‌ఫోన్లు అందజేశారు. వారు చదవుకునేందుకు వీలుగా వీటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఎడి కె.కవిత పాల్గొన్నారు.

2న జీపు జాతా

కరపత్రాలను పంపిణీ చేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ఈ ఖరీఫ్‌కి సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ మే రెండో తేదీన జీపు జాతాను చేపట్టనున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొందూరు చంద్రరావు, కె.మోహనరావు, కొత్తకోట అప్పారావు తెలిపారు. ఆరోజు ఉదయం ఏడు గంటలకు పూడివలస కూడలి నుంచి ప్రారంభమయ్యే జీపు జాతాలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని ఫరీదుపేటలో జీపుజాతా కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యాన నిర్వహించే జీపు జాతా రెండో తేదీన ఎచ్చెర్ల మండలంలోని పలు గ్రామాలు, మూడో తేదీన సోంపేట నుంచి శ్రీకాకుళం వరకు నిర్వహిస్తామన్నారు. 7వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. నారాయణపురం కుడి కాలువ దశాబ్దాలుగా మేటలు వేసి, గుర్రపుడెక్క, తూటికాడతో నిండిపోయి ఉందని, షట్టర్లు పాడైపోయి చివర భూములకు నీరందడం లేదని చెప్పారు. ఏటా ఇబ్రహీంబాద్, పూడివలస, ఫరీదుపేట, సనపలవానిపేట, కుశాలపురం, తోటపాలెం, ధర్మవరం, రామజోగిపేట, పొన్నాడ, కొత్తపేట తదితర గ్రామాలకు సాగునీరందక పంటలు పండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు బాగు చేస్తామని నాయకులు, అధికారులు మాటలు చెప్తున్నా, ఆచరణలో అమలు కావడం లేదన్నారు. ఖరీఫ్ ప్రారంభమైన తర్వాత పనులు ప్రారంభించి నీరు వచ్చిందని మధ్యలోనే పనులు ఆపివేసి బిల్లులు చేసుకుంటున్నారు తప్ప చివర భూములకు నీరందడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీరామ్మూర్తి, కొత్తకోట అచ్యుతరావు, రైతులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్‌గా

పృథ్వీరాజ్ కుమార్

శ్రీకాకుళం : జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా దొనక పృథ్వీరాజ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 24వ తేదీ వరకు ఆయన జిల్లాలో బాధ్యతలు నిర్వర్తిస్తారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఆయన 2024 ఐఎఎస్ బ్యాచ్ అధికారి. చిన్న వయసు లోనే ఐఎఎస్‌కు ఎంపికైన ఆయన వయసు ప్రస్తుతం 23 ఏళ్లు. ఆయన తండ్రి విజయ్ కుమార్ మండల విద్యాధికారిగా మన్యం జిల్లాలో పనిచేస్తున్నారు. తల్లి వెంకటరత్నం గృహిణి. సోదరి పూజిత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పరిపాలనా వ్యవహారాల్లో అనుభవం పొందేందుకు ఆయన శిక్షణ పొందుతున్నారు. అసిస్టెంట్ కలెక్టర్‌గా జిల్లాలోనే ప్రభుత్వం ఆయన్ను నియమించింది.

ఉద్యమాలను అడ్డుకోవడం ఎవరితరం కాదు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్ అనుచిత వ్యాఖ్యలు తగవు
- కార్మిక ప్రయోజనా కోసమే పోరాటం : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కార్మికోద్యమాలను అడ్డుకోవడం ఎవరితరం కాదని సిఐటియు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి అన్నారు. పరిశ్రమల్లో కార్మిక సంఘాలు, సిఐటియును కంట్రోల్ చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎదుట ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రసంగించడాన్ని తీవ్రంగా ఖండించారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. సిఎం వద్ద ప్రాధాన్యత పెంచుకోవడానికి ఆయన చాలా ప్రయాస పడ్డారన్నారు. ఇటువంటి ప్రగల్భాలు పలికిన వారు అనేకమంది కాలగర్భంలో కలిసిపోయినట్లు చరిత్ర చెప్తోందన్నారు. జిల్లాలో ట్రేడ్ యూనియన్ల పోరాటాలతో ఏ పరిశ్రమ కుంటుపడలేదని, ప్రభుత్వ విధానాల ఫలితమేనని తెలుసుకోవాలన్నారు. సిఐటియు వల్ల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారని, సిఐటియు నాయకులెవరూ పరిశ్రమల్లో కాంట్రాక్టులు తీసుకోవడం లేదన్నారు. యాజమాన్యాలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసి, యాజమాన్యాలను బెదిరించి కాంట్రాక్టులు తీసుకుంటున్న వారెవరో ప్రజలకు తెలుసునన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాల్లో కార్మికులు గాయపడుతున్నా, చనిపోతున్నా యాజమాన్యాలపై నోరెత్తని ఎమ్మెల్యే, కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసే సిఐటియుపై అనుచితంగా మాట్లాడడం శోచనీయమన్నారు. ఎన్ఇఆర్ రాజకీయాల్లోకి రాక ముందు నుంచే శ్యామ్‌పిస్టన్స్, రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో, యునైటెడ్ బ్రేవరీస్, నాగార్జున అగ్రికెమ్, ఫ్రింజ్ లేబొరేటరీస్, స్మార్ట్‌కెమ్, ఎపిబిసిఎల్‌ల్లో సిఐటియు యూనియన్లను ఏర్పాటు చేసి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, సెలవులు, క్యాంటీన్ తదితర కార్మిక చట్టాలు, వేతన ఒప్పందాలు సాధించుకుందని గుర్తుచేశారు. కష్టజీవుల పక్షాన నికరంగా పోరాడి కార్మికులకు మెరుగైన వేతనాలు సాధించి పెట్టిన ఘనత సిఐటియుదేనన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో కార్మికుల ఓట్లతో గెలిచి, కార్మిక వ్యతిరేక వైఖరిని అవలంభించడం, పరిశ్రమల్లో సిఐటియు యూనియన్లను కంట్రోల్ చేస్తున్నానని చెప్పడం సరికాదన్నారు. 1970లో సిఐటియు ఐక్యత, పోరాటం నినాదంతో ఏర్పడిందన్నారు. అప్పట్లోనే ఆమదాలవలస సహకార చక్కెర ఫ్యాక్టరీలో యూనియన్ ఏర్పాటుతో పాటు ఎచ్చెర్ల పారిశ్రామిక ప్రాంతంలో 1990 నుంచి కార్మిక చట్టాల అమలు, హక్కుల కోసం యాజమాన్యాలను ఎదిరించి సుదీర్ఘ సమ్మెలు నిర్వహించిన విషయం తెలుసుకోవాలన్నారు. సిఐటియు ఏర్పడినప్పట్నుంచీ కార్మిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై రాజీ లేని పోరాటం చేస్తోందని చెప్పారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తూ కార్మికులకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, ఎన్.వి రమణ, అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్‌గా 'శివ్వాల'

డిసిఎంఎస్ చైర్మన్‌గా అవినాష్

సూర్యనారాయణ

అవినాష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఆమదాలవలస, ఎచ్చెర్ల

జిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డిసిసిబి) చైర్మన్‌గా శివ్వాల సూర్యనారాయణను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా డిసిసిబి చైర్మన్‌గా సరుబుజ్జిలి మండలం షళంత్రి గ్రామానికి చెందిన శివ్వాల సూర్యనారాయణకు నియమించింది. ఈయన ప్రస్తుతం షళంత్రి ఎంపిటిసిగా ఉన్నారు. గతంలో సరుబుజ్జిలి జెడ్‌పిటిసిగా, షళంత్రి పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో గజపతినగరం, సాలూరు నియోజకవర్గాల పరిశీలకులుగా పనిచేశారు. ప్రస్తుతం టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

డిసిఎంఎస్ చైర్మన్‌గా అవినాష్

జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డిసిఎంఎస్) చైర్మన్‌గా చౌదరి అవినాష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన ఎస్ఎం పురం సర్పంచ్‌గా పనిచేశారు. తండ్రి చౌదరి బాబ్జీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా టిడిపి పూర్వ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. తల్లి చౌదరి ధనలక్ష్మి జెడ్‌పి చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

30లోగా రిటర్న్‌లు దాఖలు చేయాలి

శ్రీకాకుళం: జిల్లాలో ఫ్యాక్టరీల చట్టం, 1948 ప్రకారం రిజిస్టర్ అయిన రైస్‌మిల్లులు, జీడిపిక్కల కర్మాగారాలు, గ్రానైట్ కర్మాగారాలు, స్టోన్ క్రషర్‌లు, సామిల్లులు (కర్రల మిల్లులు), ఇతర పెద్ద కర్మాగారాలన్నీ ఇంటిగ్రేటెడ్ యాన్యువల్ రిటర్న్లలను ఏప్రిల్ 30వ తేదీలోగా సమర్పించాలని కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ (apindustries.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రజాసంఘాల నాయకులు

డిబార్ విద్యార్థులకు సప్లిమెంటరీ అవకాశం కల్పించాలి

శ్రీకాకుళం: మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో కుప్పిలి మోడల్ స్కూల్‌లో డిబార్ చేసిన ఐదుగురు విద్యార్థులను మేలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల్లో రాసేందుకు అనుమతిస్తామని గతంలో కలెక్టర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని మత్స్యకార, ప్రజా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం కలిసి సమస్యను వివరించారు. సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యేందుకు ఈనెల 30వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉందని, ఆన్‌లైన్‌లో చెల్లించుకుందామని వెళ్తే అందులో పేర్లు పొందుపరచలేదని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరీక్ష ఫీజు చెల్లించలేని పరిస్థితిని విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పారని కలెక్టర్‌కు వివరించారు. తక్షణమే విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీనిచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జెఎసి చైర్మన్ హనుమంతు సాయిరాం, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వి జగన్నాథరావు, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, ఇతర సంఘాల నాయకులు మిస్క కృష్ణయ్య, గణేష్, కల్లేపల్లి రాంగోపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులున్నారు.

పశువైద్యాధికారి పన్నాగం

- విచారణ జరగనీయకుండా కుయుక్తులు
- 'రియల్' మాఫియాతో బెదిరింపులు

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని కొల్లివలస పశు వైద్యాధికారి వెంకటరావు సరికొత్త పన్నాగం వేశారు. తన పనితీరు లోపాలపై ఉన్నతాధికారుల విచారణను సజావుగా సాగకుండా ఎత్తుగడ వేశారు. కార్యాలయంలోకి రైతుల ముసుగులో స్థానిక రియల్ మాఫియా నాయకులను తీసుకొచ్చారు. గొడవలు, అరుపులతో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారు. తద్వారా ఉన్నతాధికారులు వెళ్లిపోతారని భావించారు. కొల్లివలస పశువైద్య కేంద్రం పనితీరు సరిగా లేదంటూ ఇటీవల ప్రజాశక్తి జిల్లా పేజీలో వరుస కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా అధికారులు ఆ వైద్యునిపై విచారణకు సోమవారం కొల్లివలస పశువైద్య కేంద్రాన్ని సందర్శించారు. పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రమణ్యం ఆస్పత్రికి చేరుకున్నారు. తాము విచారణకు వస్తున్న విషయాన్ని ప్రజాశక్తి విలేకరి ఐ.వాసుదేవరావుకు ఎడి సుబ్రమణ్యం ఫోన్ చేసి రావాలని సూచించడంతో ఆయన అక్కడకు చేరుకున్నారు. అధికారుల అనుమతితో ఫొటోలను తీసేందుకు ప్రయత్నించారు. ఉన్నతాధికారుల రాక మునుపే కొందరు రియల్ మాఫియా నాయకులు, టిడిపి, వైసిపి నాయకులు అక్కడికి చేరుకున్నారు. పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్న సమయంలోనే వారంతా మూకుమ్మడిగా విలేకరిని నానా దుర్భాషలాడారు. వైద్య కేంద్రంలో పనిచేస్తున్న అటెండర్ సింహాచలం కుర్చీని విసిరేయగా విలేకరి తప్పించుకున్నాడు. సుమారు గంటన్నర పాటు విలేకరిని బయటకు కదలనీయలేదు.

తప్పిదాలు కప్పిపుచ్చుకునేందుకు దుష్ప్రచారం

తన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి వైద్యుడు వెంకటరావు రకరకాల ప్రయత్నాలు చేశారు. విలేకరిని రియల్ మాఫియాతో బెదిరించేందుకు ప్రయత్నించారు. ఉన్నతాధికారులు విచారణకు రావడాన్ని సహించలేని వైద్యుడు చివరకు విలేకరి తనను డబ్బులు డిమాండ్ చేశాడంటూ దుష్ప్రచారం సాగించారు. దీనిపై రైతులు మండిపడుతున్నారు. విచారణకు తప్పుదోవ పట్టించడానికే ఈ నాటకమాడుతున్నారని చెప్తున్నారు. గ్రామాలను సందర్శించి పశువుల మరణాలపై రైతుల నుంచి వివరాలు సేకరించకుండా ఉన్నతాధికారులు కార్యాలయంలో విచారణ సాగించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ వద్ద ఎంఎల్‌హెచ్‌పిల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నిరంజన్ డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖ పరిధిలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, సిహెచ్‌ఒలు ఈనెల 15నుంచి చేపట్టిన ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ సమీపాన గల జ్యోతిరావు పూలే పార్కు వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా వైద్యసేవలు అందించడంలో ఆర్థిక, ఆర్థికేతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ఏడాది మార్చి 21న కమిషనర్‌ను కలిసి సమస్యలు విన్నవించుకున్నా, ఎటువంటి సమాధానం రాలేదన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని, క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలని డమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్‌ఛార్ట్ ప్రకటించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీతో పాటు ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్‌గ్రేషియో, పితృత్వ సెలవులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సందీప్ కుమార్, రాష్ట్ర కో-ఆర్డినేటరు వినోద్‌కుమార్, నాయకులు మమత, సిహెచ్.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పలాస

కేంద్ర పభుత్వం ఆదేశాల మేరకు పలాసలో సూదికొండకు ఆనుకొని ఉన్న పదెకరాల ప్రభుత్వ భూమిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో మండలంలోని సూదికొండ సర్వే నంబరు 51లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ (హైదరాబాద్) డాక్టర్ డి.మంజునాథ్, కమల్తురు (విశాఖపట్నం), సుయాన్ ఆలం (శ్రీకాకుళం) బృందం స్థల పరిశీలన చేసింది. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకూ ఈ బృందం సూదికొండ భూములు, పలాస రైల్వే పాఠశాలను పరిశీలించింది. పై రెండు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అనువైన ప్రదేశాలుగా గుర్తించింది. సూదికొండ వద్ద నిర్మించే విద్యాలయానికి ప్రధాన రహదారిపై బృందం ఆర్‌డిఒ జి.వెంకటేష్, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తిను ప్రశ్నించింది. 40 అడుగుల ప్రధాన రహదారి కేటాయించారు. విద్యాలయం లోపలకు వచ్చేందుకు మార్గం చూపిస్తామని సమాధానం ఇచ్చారు. అనంతరం రైల్వే స్కూల్ ప్రాంతాన్ని పరిశీలించి అందులో ఆర్‌పిఎఫ్ బ్యారక్స్ నిర్వహిస్తుండడాన్ని గుర్తించారు. తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు పాఠశాల సరిపోతుందని బృందం తెలిపింది. మొత్తం వ్యవహారాన్ని ఫొటోలు తీయించి కేంద్రానికి సమర్పిస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. అనంతరం డెప్యూటీ కమిషనర్ డాక్టర్ డి.మంజునాథ్ విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అంతా సిద్ధమైందని, స్థలాలు కూడా బాగే ఉందని అన్నారు. మొత్తం వ్యవహారాన్ని కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు. కేబనేట్ నిర్ణయం మేరకు ఎప్పుడు ఏర్పడుతుందో ప్రకటిస్తారని స్పష్టం చేశారు. తాత్కాలికంగా రైల్వే పాఠశాలలో తరగతులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.



వివరాలను సేకరిస్తున్న బృందం

జిల్లా ప్రాజెక్టు కార్యాలయం - సమగ్ర శిక్షా, శ్రీకాకుళం

టెండరు ప్రకటన

జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం.

రేఖా సంఖ్య.200551/హెచ్/ఎస్.ఎస్/శ్రీకాకుళం/2023

విషయం:- సమగ్ర శిక్షా, శ్రీకాకుళం పరిధిలో గల 25 కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు మరియు 13 ఆదర్శ పాఠశాలలకు కూరగాయలు మరియు పండ్లు సరఫరా చేయుట అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులు ఆహ్వానించుట కొరకు.

1. **సరఫరా చేయవలసిన వస్తువులు:** కూరగాయలు మరియు పండ్లు
2. **టెండరు దరఖాస్తు విలువ:** రూ.2,000/- (తిరిగి చెల్లించబడదు)
3. **దరఖాస్తు రుసుము డిడి తీయవలసిన పేరు:** జిల్లా కలెక్టరు మరియు చైర్మెన్, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం వారి పేరున యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కిల్లిపాలెం బ్రాంచ్ నందు చెల్లుబాటు అయ్యేవిధంగా.
4. **టెండరు సెక్యూరిటి ఈ.ఎం.డి డిపాజిట్:** కూరగాయలు సరఫరా చేయుటకు రూ.1,00,000/- జిల్లా కలెక్టరు మరియు చైర్మెన్, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం వారి పేరున యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కిల్లిపాలెం బ్రాంచ్ నందు చెల్లుబాటు అయ్యేవిధంగా.
5. **టెండరు ఫారం సమర్పించవలసిన గడువు:** తే.30.04.2025ది నుండి తే.05.05.2025ది వరకు (కార్యాలయపు పనివేళలు నందు మాత్రమే) ఉదయం గం.10:30ని.ల నుండి సాయంత్రం గం.05:00ని.ల వరకు.
6. **టెండరు దరఖాస్తులు** జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం నందు తే.30.04.2025ది నాటి నుండి లభించును. మరిన్ని వివరములకు జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం నందు సంప్రదించగలరు.

అదనపు పథక సమన్వయకర్త, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం.

IN THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM
O.S. No. 16/2017

Between:
Mahammad Haneef. ...Plaintiff.
And:
Md.Shanwaj and others ...Defendants.

To,
D-31: Singuru Tagore,
S/o Satyanarayana,
aged about 50 years,
Hindu, residing at Plot No.402,
Ramanjaneya Enclave, Bondilipuram,
Srikakulam Town and District.
D-32: Singuru Sujatha,
W/o Tagore, aged about 42 years,
Hindu, Household duties, rest do.

NOTICE

It is to inform you that the above matter stands posted to on 05-05-2025 for your appearance Hence you have to appear before the Honourable court on **05-05-2025 at about 10.30 AM** .as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.

// By order of the Honourable court//

KOTTAKOTA SRINIVASA RAO
ADVOCATE,
SRIKAKULAM, CELL: 8966524701.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వీఆర్ఎల మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- లావేరు

లావేరు మండల విఆర్ఎ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు బి.త్రినాథరావు ఆధ్వర్యంలో కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడుగా తలే నారాయణరావు, ఉపాధ్యక్షుడుగా అండ గోల్లారావు, ప్రధాన కార్యదర్శిగా లింగాల జ్యోతి, కోశాధికారిగా సవలాపురపు తౌడు ఎన్నికకాగా మరో 16 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు త్రినాథరావు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో విఆర్ఏలు మామిడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరాహారదీక్ష చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ఆర్‌టిసి ఉద్యోగుల రిలే నిరాహారదీక్ష

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు ఎం.జె.దేవ్, ఎస్.పార్వతీశం, ఎ.ఎ. నాయుడు మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఉద్యోగ, భద్రతా సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని కోరారు. అక్రమ సస్పెన్షన్లను, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే ఆపాలన్నారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగోన్నతులను తక్షణమే అమలు చేయాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జిఒ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. బిఇహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం, సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. 18114 జీవో లో పొందిన పరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌ను 150 నుంచి 400 వరకు చెల్లింపులు చేయాలన్నారు. తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణాలను అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, ఎస్.ఆంజనేయులు, ఎస్.పార్వతీశం, టి.లక్ష్మణరావు, టి.శ్రీనివాసులు, ఎన్ఎన్.కుమార్, ఎస్.పి.కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న కూలీలు

'ఉపాధి' కూలీల ఆర్థికసాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని పొందర వీధికి చెందిన సింహాచలం బెహరా కిడ్నీ వ్యాధి సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురైన సింహాచలం భార్య బెహరా ధనలక్ష్మి కుటుంబాన్ని పోషిస్తుంది. అయితే తన కష్టాన్ని చూసి తోటి ఉపాధి కూలీలు అండగా నిలిచారు. దీంతో స్థానిక ఉపాధి హామీ కూలీలు రూ.11 వేలు వసూలు చేశారు. ఈ ఆర్థికసాయాన్ని సోమవారం ధనలక్ష్మికి అందజేశారు. ఇంకెవరైనా వాళ్లకు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకొస్తే ఫోన్ పే 8639346557 ద్వారా సహాయం చేసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని ధనలక్ష్మి కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్ చాణుక్య, మేట్లు పాల్గొన్నారు.

అప్పలరాజు ఆరోపణలకు చెంపదెబ్బ

ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి- పలాస

పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి సెంట్రల్ సిలబస్ అందించాలనే యోచనలో ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉన్నారని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని సూదికొండ ప్రాంతంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాయకులు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దీనిపై విషం చిమ్ముతున్నారని, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర బృందం స్థల పరిశీలన చేయడంతో ఆయనకు చెంప దెబ్బ తగిలినట్లు అయిందని వ్యాఖ్యానించారు. కేంద్ర విద్యను పలాసలోని పేదలకు అందించాలని అనుకుంటే మాజీ మంత్రికి రుచించడం లేదని దుయ్యబట్టారు. అభివృద్ధికి అడ్డు చెప్పవద్దని, కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి స్థలాన్ని చదును చేస్తున్నా దానికీ రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, టంకాల రవిశంకర్ గుప్తా, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, దడియాల నర్సింహులు, కొండే నర్సింహులు, జోగ మల్లి పాల్గొన్నారు.

మేడేను స్ఫూర్తివంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- లావేరు

మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను స్ఫూర్తివంతంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి. రమణ, బి.ఉత్తర పిలుపునిచ్చారు. లావేరులో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరల పెరుగుదల, అవసరాల దృష్ట్యా ప్రతి కార్మికునికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను, అంగన్వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ, ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఆప్కాస్ రద్దు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందన్నారు. ప్రజల త్యాగాలతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, పోర్టులు, రైల్వే, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులు కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. పోరాటాలతోనే హక్కులు సాధ్యమని, ఐక్యపోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం మండల నాయకులు ఎల్.లక్ష్మి, హెచ్.వజ్రమ్మ, కె.పద్మ కృష్ణవేణి, ఆర్.వరలక్ష్మి, బి.భారతి, ఎ.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

లావేరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఎల్ఎన్‌పేట : మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఎల్.ఎన్.పేటలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో కె.లక్ష్మి, జి.పావని, పుణ్యవతి, సుశీల, సుదీప్ష పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు జిల్లా నాయకులు నంబూరి షణ్ముఖరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం భవన కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 1న ఉదయం 9 గంటలకు టెక్కలి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దకు కార్మికులు అందరు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి ప్రదర్శనగా శంబానవీధిలో గల సిఐటియు కార్యాలయానికి చేరుకుంటామని, అక్కడ సమావేశం నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో యండా వైకుంఠరావు పాల్గొన్నారు.

కిట్‌ను అందజేస్తున్న డిఇఒ తిరుమల చైతన్య, అధికారులు

వికలాంగ విద్యార్థికి కిట్ అందజేత

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక భవిత కేంద్రానికి చెందిన వికలాంగ విద్యార్థి గేదెల దేవేంద్రకు నెల్లూరులోని సిఆర్‌సి కేంద్రం అందజేసిన ఎంఆర్ కిట్‌ను సోమవారం జిల్లా విద్యాధికారి తిరుమలచైతన్య అందజేశారు. జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో దేవేంద్రకు ఈ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఎపిసి శశిభూషణ్, జిల్లా సిహిత విద్య కో-ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు, ఐఇఆర్‌టి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి- అరసవల్లి

శక్తి యాప్‌తోనే మహిళలు, విద్యార్థులకు భద్రత, రక్షణ లభిస్తుందని ప్రతిఒక్క మహిళ, విద్యార్థులు ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తిటీమ్ సభ్యులు కోరారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు సోమవారం శక్తి యాప్ ప్రాధాన్యత ఆవశ్యకతను పాఠశాల, కళాశాల, పబ్లిక్ ప్రదేశాల్లో మహిళలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఫోన్‌లో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకొని ఆపద సమయంలో శక్తి యాప్ ద్వారా పోలీస్‌ల సహాయం పొందాలని సూచించారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

లక్ష్మీశ్రీకాంత్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్ఇండ్‌హెచ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న నక్కా లక్ష్మీశ్రీకాంత్‌కు ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పిహెచ్ పట్టాను మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం లక్ష్మీశ్రీకాంత్‌కు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'సోలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ - ఎ స్టడీ ఆఫ్ మున్సిపల్ కార్పొరేషన్స్ ఇన్ నార్త్ కోస్టల్ ఆంధ్ర ప్రదేశ్ ' అనే అంశంపై ప్రొఫెసర్ గుంట తులసీరావు మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు ఈ పిహెచ్‌డి పట్టాను బిఆర్ఎయు జారీ చేసిందన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెడ్డీ డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్‌ఒడిలు డాక్టర్ ఎం.వి.రత్నమణి, డాక్టర్ ఎం. రమణయ్య, డాక్టర్ బి. శివకుమార్ అభినందించారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం బొంతలకోడూరు గ్రామ సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు చెక్ పవర్‌ను ఆరు నెలల పాటు తాత్కాలికంగా రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాల ఆవరణలో పంచాయతీలో సచివాలయ భవనం నిర్మించవద్దని హైకోర్టు ఆదేశాలున్నా ఇంజినీరింగ్ అధికారుల సంతకాలు లేకపోయినా నిబంధనలు అతిక్రమించి రూ.1,81,339 చెక్కును గుత్తేదారుకు సర్పంచ్ ఇవ్వడం చట్టవిరుద్ధమని దీనికి బాధ్యులుగా చర్యలు తీసుకున్నట్లు ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కోరుకొండ వెంకట సుబ్రహ్మణ్యం మీ కోసం ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేయగా నిబంధలకు విరుద్ధంగా నిధులు విడుదల చేసినట్లు గుర్తించి ఆరునెలల పాటు తాత్కాలికంగా చెక్కు పవర్ రద్దు చేసినట్లు డిపిఒ తన ఉత్తర్వులో పేర్కొన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి ప్రధాన రహదారి బెండిగేటు- నువ్వులరేవు రోడ్డు పనులు వెంటనే పూర్తిచేసి ప్రయాణికులను ఆదుకోవాలని సిఐటియు, ఆటో కార్మిక సంఘం డిమాండ్ చేసింది. త మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఎన్.మోహనరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రాజు మాట్లాడుతూ ఉన్న రోడ్డును ఇరువైపులా తవ్వి గ్రావెల్ వేసి వదిలేయడంతో అనేక వాహనాలు బోల్తా పడి ప్రయాణికులు గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బెండి గేటు కూడలి బెండి గ్రామాలు వద్ద ఒక పక్క సిమెంట్ రోడ్డు వేసి వదిలేయడంతో దుమ్ము, ధూళి ఎగిరి ఊపిరితిత్తులు జబ్బులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డును తవ్వి ఎనిమిది కిలోమీటర్లు పని పూర్తిచేయకపోవడంతో అనేక మంది ప్రజలు, అధికారులు సైతం ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక మరో 20 కిలోమీటర్లు అదనపు దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా రోడ్డు దుస్థితి మాత్రం మారడం లేదని వాపోయారు. అనంతరం తహశీల్దారు సీతారామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి కౌలుదారుల సంఘం నాయకులు బి.ఆనందరావు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.గణపతి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్.తిరుపతి, కె.వెంకటరావు, ఎస్.కృష్ణారావు, ఇప్పిలి నాగేశ్వరరావు, బగాతి గోపాలరావు, ఎం.సింహాచలం, సంతోష్, బి.శంకర్, ఎన్.సింహాచలం, ధనలక్ష్మి, చంద్రయ్య పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చెరువులను మినీ రిజర్వాయర్లుగా మార్చాలి

ఇఇకి వినతిపత్రం అందజేస్తున్న బిసి సంఘం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని సోంపేట, కంచిలి, మందస మండలాల్లో ఎనిమిది చారిత్రాత్మకమైన చెరువులను మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేసి రైతాంగానికి శాశ్వతంగా సాగునీరు అందించాలని బిసి సంక్షేమ సంఘం, సోంపేట ప్రాంత రైతాంగ ప్రతినిధులు కోరారు. సోమవారం శ్రీకాకుళంలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ పొన్నాడ సుధాకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సోంపేట, కంచిలి, మందస మండలాల్లో ప్రాచీన కాలం ఈప్రాంతాన్ని పరిపాలించిన రాజులు విశాలమైన ప్రదేశాల్లో కొండ ప్రాంతాల్లో వర్షపు నీటిని వడిసి పట్టి ఏళ్ల తరబడి నీటినిల్వలు సమృద్ధిగా ఉండే విధంగా చెరువులు తవ్వించారని, వీటిని ఆధునికరించకుండా ప్రభుత్వాలు విస్మరించడం వల్ల ఏటా వందల ఎకరాల విస్తీర్ణం చెరువు గర్భాలు ఆక్రమణలకు గురై ప్రస్తుతం నీటి నిల్వకు వీలు లేకుండా పోతున్నాయని వివరించారు. ఇటీవల నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటనకు వచ్చినపుడు వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలో ఉన్న 22 చెరువులను మాత్రమే మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. దీనివలన వంశధార ఆయకట్టులో లేని ఈ ఎనిమిది చెరువులు నిర్లక్ష్యానికి గురవు తున్నాయన్నారు. ఇఇని కలిసిన వారిలో బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, సంఘం న్యాయ సలహాదారు చౌదరి లక్ష్మణరావు, పల్లి హరిచంద్ర, కర్రి జయరాం, పల్లి నాగేశ్వరరావు, గేదెల మోహనరావు, దేవరాజ్ తదితరులున్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం మేజర్ పంచాయతీలో హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రజలు నివాస ప్రాంతంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణాన్ని తొలగించాలని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. స్థానిక మహిళలు, నివాసస్తులు మద్యం దుకాణాన్ని తొలగించాలని కొద్ది రోజులు చేపడుతున్న నిరసనకు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రోత్సాహంతో ఇళ్ల మధ్య మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఇక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మద్యం షాపు వద్దని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేసినా స్పందించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్, ఏనుగుతల సూర్యం పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

శివానీ కళాశాలకు అటానమస్ హోదా

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం చిలకపాలెం సమీపంలోని స్థానిక శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు 2025-26 విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యుజిసి) ఇచ్చే అటానమస్ హోదా గుర్తింపు వచ్చిందని కళాశాల ప్రధానాచార్యులు డా. వై.శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో యాజమాన్య సభ్యులు వి.ఎం.ఎం.సాయినాథ్ రెడ్డి, దుప్పల వెంకటరావు, పి.దుర్గా ప్రసాదరాజు, కె.దుర్గాశ్రీనివాస్, సనపల శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల ఇప్పటివరకూ జెఎన్‌టియు, విజయనగరం అనుబంధంగా కొనసాగడంతో పరీక్షలు, సిలబస్ అన్ని వర్సిటీ పర్యావేక్షణలో జరిగాయన్నారు. ప్రస్తుతం అటానమస్ హోదా లభించటంతో ఈ విద్యా సంవత్సరం నుంచి సొంతంగా సిలబస్ తయారు చేసుకొని మెరుగైన నాణ్యమైన విద్యనందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీంతో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించే సిలబస్ మార్పుతో పాటు, పరీక్ష ప్రశ్నాపత్రాలు స్వతహాగా తయారుచేసి పరీక్షలు తామే నిర్వహించి మూల్యాంకనం చేసే అవకాశం వచ్చిందన్నారు. ఈ గుర్తింపు వల్ల కళాశాలలో చదవే విద్యార్థులకు ఫీజుల్లో ఎటువంటి మార్పు ఉండదని, ప్రభుత్వం నిర్ణయించే ఫీజులు వర్తిస్తాయన్నారు. యుజిసి ఈ గుర్తింపును ఐదేళ్ల పాటు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.జి.టి.చంద్రశేఖర్, విభాగాధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రి మహోత్సవాలు

పాతపట్నం : పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారి 50వ వార్షికోత్సవ నవరాత్రి యాత్ర మహోత్స వాలను ఈ నెల 29 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇఒ టి.వాసు దేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవాలకు ఆంధ్రా, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివస్తారని తెలిపారు. ఆలయ సిబ్బంది, పోలీసులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యా సహాయకుల సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

టెక్కలి రూరల్ : టెక్కలి మండల సంక్షేమ, విద్యాసహాయకుల అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో అధ్యక్షునిగా కుర్మాపు సంధ్య, ఉపాధ్యక్షునిగా పొన్నాడ సూర్యనారాయణ, పృథ్వీ, ప్రధాన కార్యదర్శిగా మడపాల సుదర్శన్, కార్యదర్శిగా బెండి మనోజ్, కోశాధికారిగా దాసుపురం ప్రదీప్, లక్ష్మణలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మెట్ట మోహనరావు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి- లావేరు

హత్యాయత్నం కేసులో గుమ్మడాం గ్రామానికి చెందిన గుండ ఆదినారాయణను సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 26న రాత్రి నాగంపాలెం గ్రామానికి చెందిన కెళ్ల సత్యనారాయణను ఆదినారాయణ పాతకక్షలు నేపథ్యంలో మద్యంమత్తులో చాకుతో గొంతు, చేతులపైన తీవ్రంగా గాయపర్చగా అడ్డుకోబోతున్న కెళ్ల రామారావును చాకుతో ముక్కుపైన గాయపర్చడంతో గాయపడ్డారు. సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులను ప్రవేశపెట్టిన ఎస్ఐ షరీఫ్

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వేస్టేషన్‌లో తమిళనాడు రాష్ట్రం మదురై నార్త్ బ్లాక్, వాగైకులంకు చెందిన జె.శ్రీధర్, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మార్లాబాడు చెందిన శ్యామలకరాజ్, అదే రాష్ట్రం అంగరుడు చెందిన రింకు బిరో రెండు బ్యాగుల్లో తొమ్మిది కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పట్టుపడ్డారని ఎస్ఐ కె.షరీఫ్ తెలిపారు. ఈ మేరకు నిందితులను సోమవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం రాత్రి 10 గంటల తరువాత ముగ్గురు నిందితులు తమిళనాడు వెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్లో ప్రయాణించేందుకు టిక్కెట్లు తీసుకున్నారన్నారు. వీరిపై ఎవరికీ అనుమానం రాకుండా వేర్వేరు ప్రాంతాల్లో నిలబడి రైలుకోసం వేచి చూస్తున్నారని తెలిపారు. ఈ సమయంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న తమ పోలీసులు వారిని ప్రశ్నించడంతో పరారీ అయ్యేందుకు ప్రయత్నించడంతో పట్టు బడ్డారన్నారు. వారి బ్యాగులు పరిశీలించగా గంజాయి బయట పడిందన్నారు. మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి విశాఖపట్నం రైల్వేకోర్టులో హాజరుపరిచామని, అక్కడే సెంట్రల్ జైలుకు నిందితులను తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్త చేస్తున్నామన్నారు.

యువకునిపై గొడ్డలితో దాడి

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ ఇందిరా కాలనీలో ఓ యువకుడిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి గొడ్డలితో దాడి చేయడంతో కలకలం రేగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఇందిరా కాలనీకి చెందిన దుక్క సంతోష్, జీరు శంకర్ మురుగునీటి ప్రవాహం విషయంలో ఇరువురి మధ్య వివాదం పెరిగింది. ఈ క్రమంలో జీరు శంకర్ సంతోష్ తలపై గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రున్ని నౌపడ పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స వైద్యం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నౌపడ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆవుకు వైద్యం చేస్తున్న ప్రైవేటు వైద్యుడు

అన్నంపేటలో రెండు ఆవులు మృతి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అన్నంపేట గ్రామంలో సోమవారం పేడాడ రంగారావు అనే పాడి రైతుకు చెందిన నాలుగు పశువులు కుడితి తాగగా అనారోగ్యానికి గురయ్యాయి. అయితే పశువైద్యకేంద్రం వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో సంచి డాక్టర్లను ఆశ్రయించారు. చికిత్స పొందుతూ రెండు ఆవులు మృతి చెందాయి. సుమారు లక్షలు రూపాయల విలువ చేసే ఆవులు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయానని రైతు వాపోయాడు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాడి రైతుని ఆదు కోవాలని, రైతుతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

వైద్యం అందక రంగారావు అనే పాడి రైతు పశు వులు మృతి చెందడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడని, ప్రభుత్వం తక్షణమే రైతుకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యాధికారుల పనితీరును పరిశీలించి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లంఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట, ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్లో పరిధిలో సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశామని, అలాగే 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సిఐ కె.బేబీ తెలిపారు. మందస మండలం పట్టులోగాం సమీపం సారా బట్టీల స్థావరాలపై దాడులు చేపట్టామన్నారు. అలాగే సోంపేట మండలం కొరంజి భద్ర సమీపంలో నాటుసారాను రవాణా చేస్తున్న ఎస్.రాము, డి.కేశవ్, ఎస్.కొమ్మంది అను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

చేరుకున్న పాఠ్య పుస్తకాలు

ఇచ్ఛాపురం : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం మండల స్టాక్ పాయింట్‌కి లిసర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రలో భాగంగా మొదటి విడతగా పాఠ్య పుస్తకాలు 32,162 వచ్చాయి. వాటిని మండల స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు. ఈ స్టాక్ పాయింట్‌ను ఎంఇఒలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథ్ పరిశీలించారు. సమగ్ర శిక్షణ సిబ్బంది పాఠ్య పుస్తకాలను వేరు చేస్తున్నారు.

వ్యవసాయశాఖ కార్యాలయానికి తాళం

రైతులకు అందుబాటులో లేని వైనం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయానికి తాళాలు వేసే ఉంటున్నాయని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. సోమవారం ప్రజాశక్తి ప్రతినిధి వ్యవసాయ అధికారి కార్యాలయానికి మధ్యాహ్నం 1:40 నిమిషాలకు వెళ్లేసరికి తాళాలు వేసి ఉన్నాయి. కార్యాలయ ఉనికి తెలిపే బోర్డు కూడా లేకపోవడం గమనార్హం. వ్యవసాయ కార్యాలయానికి తాళం వేసి ఉండటంపై చుట్టుపక్కల వారిని అడిగితే వ్యవసాయ శాఖాధికారి ఉదయం ఉండేవారని ఆ తరువాత వెళ్ళిపోయారని పలువురు తెలిపారు. నిత్యం సచివాలయాలు తనిఖీ, వీడియో కాన్ఫరెన్స్ పేరుతో ఆయన వెళ్లిపోతుంటారని పలువురు చెబుతున్నారు. వ్యవసాయ అధికారి, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయ అధికారి, సిబ్బంది లేకపోవడంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే రైతులు అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారి లేకపోయినప్పటికీ సిబ్బంది అయినా కార్యాలయంలో అందుబాటులో ఉండాలని, కార్యాలయానికి వచ్చే రైతుల సందేహాలను నివృత్తి చేయాల్సిన వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయాధారిత మండలంలో వ్యవసాయాధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటం సమంజసం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కార్యాలయానికి వేసి ఉన్న తాళం

మరికొద్ది రోజుల్లో ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కానుందని, ముందస్తుగా రైతులకు సలహాలు, సూచనలు అందించాల్సిన వ్యవసాయ అధికారులు కానరాకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని సమస్యను పరిష్కరించి మేలు చేకూర్చాలని పలువురు రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇదే విషయమై వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి రాజగోపాలరావును వివరణ కోరగా కార్యాలయ వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అతనో.. అజాతశత్రువు

ప్రజాశక్తి- కవిటి

విజయనగరం జిల్లా రాజాంలో జూనియర్ అసిస్టెంట్‌గా వృత్తి జీవితం ప్రారంభించిన ఆయన 12 ఏళ్ల తర్వాత సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం 16 ఏళ్ల తర్వాత పంచాయతీ విస్తరణ అధికారిగా పదోన్నతి పొంది ఎనిమిదేళ్లు తన అమూల్యమైన సేవలందించి ఈ నెలాఖరున ఇఒపిఆర్‌డిగా పదవీ విరమణ చేస్తున్నారు శివాజీ పాణిగ్రాహి. మోముపై చెదరని చిరునవ్వు, క్లిష్ట పరిస్థితుల్లో కూడా కనిపించని అలసట ఆయన ఆభరణాలు. అవే ఆభరణాలు వృత్తి జీవితంలో బాహ్య ప్రపంచంలో శివాజీ పాణిగ్రాహిని అజాత శత్రువుగా నిలిపాయి. ముఖ్యంగా కలెక్టర్ ఇచ్చిన టాస్క్ పూర్తి చేయాలన్నా, జిల్లాలో తాను పనిచేస్తున్న మండలం ముందు వరుసలో నిలవాలన్నా, మండలంలో ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు చేయాలన్నా అధికారుల నాలుకపై మెదిలే పేరు శివాజీ పాణిగ్రాహి. ఇక ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఆయనో నడిచే గ్రంథాలయం. తమ సందేహాలు, వృత్తి రీత్యా ఉన్న సమస్యలు శివాజీ పాణిగ్రాహి వద్ద ప్రస్తావిస్తూ మార్గదర్శనం పొందారని చెప్పడం ఈ సందర్భంలో అత్యవసరం. అదే సమయంలో తోటి ఉద్యోగులకు అండగా, కింది స్థాయి ఉద్యోగులకు పెద్దన్నగా శివాజీ పాణిగ్రాహి పోషించిన పాత్ర అతని వ్యక్తిత్వానికి నిదర్శనం.

అవార్డు అందుకుంటున్న ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి (ఫైల్)

వృత్తినే దైవంగా భావించే శివాజీ పాణిగ్రాహి 2006 ఆగస్టు 15న అప్పటి కలెక్టర్ నుంచి ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకోగా, జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 2025 ఏప్రిల్ 24న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, జెడ్‌పి సిఇఒ ఎల్.శ్రీధర్ చేతుల మీదుగా మరోసారి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆదర్శ ఉపాధ్యాయులు రామచంద్ర పాణిగ్రాహి-దమయంతి నాలుగో సంతానంగా జన్మించిన శివాజీ పాణిగ్రాహి శ్రద్ధ, అంకిత భావం, పట్టుదలతో తన 38 ఏళ్ల ఉద్యోగ జీవితం కొనసాగించి ఏప్రిల్ 30 బుధవారం ఉద్యోగ విరమణ చేస్తు న్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఆయ నకు ఘనమైన వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రారంభమైన వేసవి శిక్షణా శిబిరం

ఆమదాలవలస : సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సూర్యనారాయణ తదితరులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద ఉన్న శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా శిబిరాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు తమ్మినేని సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాఠకులను, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవుల దృష్ట్యా పిల్లలు విశ్రాంతి సమయంలో ఆటలకు కొంత సమయం కేటాయించి ఎక్కువ సమయం జ్ఞానాభివృద్ధికి కేటాయించాలన్నారు. గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ సౌకర్యాన్ని పిల్లలు, పెద్దలే కాకుండా స్త్రీలు కూడా వినియోగించుకోవాలని కోరారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో సీనియర్ సిటిజన్ టి.వీరభద్రుడు విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, విశ్రాంతి ఉపాధ్యాయులు ఎ.సత్యనారాయణ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లి: బలగ శాఖా గ్రంథాలయం, హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను తెలిపారు. బలగ శాఖా గ్రంథాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం అన్నెపు ఉన్నాయి, బాల కథానిలయం అధ్యక్షులు భోగిల ఉమామహేశ్వరరావు సరస్వతి దేవి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా బాల కథానిలయం అధ్యక్షులు చిన్నపిల్లలకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం మనోజ్ ప్రారంభించారు. గ్రంథాలయంలో అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ప్రతి ఒక్కటి చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సెట్‌శ్రీ పూర్వపు సిఇఒ సురంగి మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోనుకు దూరంగా ఉండి పుస్తకాలకు దగ్గర కావాలన్నారు. కార్యక్రమంలో ఎం.ఉపేంద్ర శర్మ, ఎస్.సాయికృష్ణ, చోడవరం ఈశ్వరరావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా, ఉప గ్రంథాలయాధికారి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి ఉగ్రసేను

విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు కళారంగాలపై ఆశక్తి పెంచుకోవాలని ప్రముఖ మిమిక్రీ కళాకారులు ఎల్.నందికేశ్వరరావు అన్నారు. చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యాన నగరంలోని కలెక్టర్ బంగ్లా సమీపాన పిల్లలకు ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సహకారంతో చేపడుతున్న ఈ శిక్షణలో బాలల విజ్ఞాన, వినోద, వికాస సంస్థ ఏటా పిల్లలకు, మానసికోల్లాసాన్ని పెంపొందించే కళలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పేపర్ క్రాఫ్ట్ వస్తువులు, కటింగ్ డిజైనర్ దీప్తిలు, నృత్యం వంటి వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిబిరంలో నటుకుల మోహన్, బి.ఎం.ఎస్.పట్నాయక్, నిక్కు హరిసత్యనారాయణ, చిత్రకళ శిక్షకులు సాయిప్రాద్, నృత్య శిక్షకులు డా. నీరజా సుబ్రహ్మణ్యం, పొన్నాడ రవికుమార్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి డా. పైడి. సింధూర, బి.దేవభూషణం, పి.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి. స్థానిక శాఖాగ్రంథాలయంలో శిక్షణా తరగతులను ప్రారంభించామని గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ తెలిపారు. వచ్చే 28 వరకు కథలు చెప్పడం, దినపత్రికలు చదివించడం, డ్రాయింగ్, క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పాతపట్నం: స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా యోగా గురువులు ఎ.కోటేశ్వరరావు, కిల్లారి శ్యాంబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి కాలరాజు అధ్యక్షులుగా, పెద్దింటి ఆనందరావు ముఖ్య శిక్షకులుగా వ్యవహరించారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినిచేసుకోవాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం చేస్తే పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సొంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో శాఖాగ్రంథాలయాధికారి టి.ఇందిరా, విజ్ఞాన భారతి ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు, ఉపాధ్యాయులు తిరుపతిరావు, సిబ్బంది డి.లక్ష్మి పాల్గొన్నారు.

'సజ్జల'తో పూడి నేతాజీ భేటీ

ప్రజాశక్తి- కవిటి

సజ్జలతో నేతాజీ

ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి అధికార ప్రతినిధి, కవిటి మండల వైస్ ఎంపిపి పూడి నేతాజీ వైసిపి నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డితో సోమవారం రాత్రి భేటీ అయ్యారు. రాష్ట్రస్థాయి వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధుల శిక్షణా తరగతులకు హాజరైన నేతాజీ ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు సమస్యలు సజ్జల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నియోజకర్గంలో పార్టీ పటిష్టత, కేడర్ బలోపేతంపై సజ్జల పలు సూచనలు చేశారు. అదే సమయంలో భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు.

రానున్న రోజుల్లో వైసిపిదే అధికారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. సోమవారం అమరావతిలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధుల శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిస్థితులు, పార్టీ పటిష్టతపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి గోవిందరావుకు పలు సూచనలు, సలహాలు అందజేసినట్లు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రతిఇంటా అభివృద్ధి, సంక్షేమం వెల్లివిరిశాయన్నారు. అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబుది ఆవకాశవాద రాజకీయమని, పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలని రామకృష్ణారెడ్డి సూచించినట్టు గోవిందరావు తెలిపారు.

వినతులను స్వీకరిస్తున్న తహశీల్దార్ మురళీమోహన్

సమస్యల పరిష్కారానికే 'మీకోసం'

ప్రజాశక్తి- కవిటి

సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం పలువురు అర్జీదారులు మ్యుటేషన్, భూ సంబంధిత సమస్యలపై వినతులు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణమూర్తి, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, వ్యవసాయశాఖ అధికారి పిరియా శ్రీదేవి, పిఆర్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, ఎపిఎం గోవిందరావు, హౌసింగ్ ఎఇ రఘు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సత్కారం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గొర్లెపాడు కార్యదర్శిగా ఎర్ర రాజేష్ విధులు నిర్వహించి ఉద్యోన్నతిపై కంచిలి మండలం అంపురం పంచాయతీకి బదిలీ అయ్యారు. రాజేష్‌కు ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, తోటి కార్యదర్శులు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా కొజ్జిరియ, గొర్లెపాడు పంచాయతీల్లో రాజేష్ చేసిన సేవలను గుర్తు చేశారు. భవిష్యత్‌లో రాజేష్ ఉన్నత శిఖరాలను అధిరోహించి పంచాయతీరాజ్ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, ఇఒ వీరభద్రస్వామి, కంప్యూటర్ ఆపరేటర్ మనోజ్ పాల్గొన్నారు.

రీ సర్వేలో సూచనలు చేస్తున్న తహశీల్దార్ రాజశేఖర్

రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశక్తి- లావేరు

భూములు రీ సర్వే పారదర్శకంగా ఉండాలని తహశీల్దార్ మంగం రాజశేఖర్ రీసర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని హనుమంతుపురంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని తహశీల్దార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సర్వేలో పొరపాట్లుకు చోటు లేకుండా ఉండాలని చుట్టూ కొలత హద్దులు క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. విస్తర్ణంలో కొలతలను రోవర్‌ను ఉపయోగించి సర్వే నిర్వహించాలని చెప్పారు. అనంతరం కేసవరాయునిపాళెం, మురపాక, పెదరావుపల్లిలో పర్యటించారు. ఈయనతో పాటు మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, రీసర్వే డిటి ఎం.తిరుపతిరావు, అర్‌ఐ రాపర్తి అప్పలరాజు, విఆర్‌ఒ గోవిందరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రవివర్మ జయంతి

ప్రజాశక్తి- అరసవల్లి

రవివర్మ జయంతి సందర్భంగా గద్ద ఈకపై తైలవర్ణ చిత్రాల రూపకల్పన- హిందూ దేవతా మూర్తులను తొలిసారిగా అందమైన తైలవర్ణ రూపాలతో చిత్రీకరించి చరిత్ర సృష్టించిన భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ 178వ జయంతి ఈ నెల 29న మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ ఆధునిక చిత్రకారుడు వాడాడ రాహుల్ పట్నాయక్ గ్రద్ద ఈకపై రవివర్మ వర్ణచిత్రంతో పాటు ఆయన కుంచె నుంచి జాలువారిన హంస దమయంతి, శకుంతల, లక్ష్మీదేవి, అహల్య, రంభ, మేనక తిలోత్తమ, మహాశ్వేతాదేవి, కేరళలోని కిల్లి మనోర్ ప్యాలెస్ (రవివర్మ నివాసం)ను స్వహస్తాలతో పొందు పర్చాడు. రాహుల్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో పురస్కారాలు పొందారు. పక్షుల వెంట్రుకలపై శ్రీనివాస కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీకష్ణ రాసలీల ఘట్టాలతో పాటు సింహాద్రి అప్పన్న, ఈశ్వరుడు, వినాయకుడు తదితర చిత్రాలు వేశారు. అలాగే స్వామి వివేకానంద, భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా చిత్రాలను పక్షివెంట్రుకలపై అపురూపంగా వేశారు. పాఠశాలల గోడలపై ఎన్నో విద్యా సంబంధిత చిత్రాలను వేసి ప్రశంసలు పొందారు. గత రెండు దశాబ్దాలుగా లలిత కళల్లో ఒకటైన చిత్రలేఖనానికి విశిష్ట సేవలందిస్తున్నారు. ఆయా రచయితల పుస్తకాలకు ముఖ చిత్రాలు వేసి కళా ప్రియుల హృదయాలను దోచుకుంటున్నారు. బియ్యపు గింజలపై సయితం చిత్రాలను వేసి తన సత్తా చాటుకుంటున్నాడు. అమెరికా బుక్ ఆఫ్ వరల్డ్, రావా బుక్ ఆఫ్ వాల్ రికార్డ్స్, ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, హై రేంజ్ వరల్డ్ రికార్డ్స్, గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నీస్ బుక్‌లో స్వర్ణ పతకం సాధించాడు. స్వతహాగా రాహుల్ పక్షుల ప్రేమికుడు. వివిధ జాతులకు చెందిన 35 పక్షులను పెంచుతున్నాడు. వాటిని పోషిస్తూ సంరక్షణ బాధ్యతలను చేపడుతున్నాడు. తాజాగా విశాఖపట్నం చిత్రకళా పరిషత్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాహుల్‌కు వడ్డాది పాపయ్య స్మారక పురస్కారాన్ని ప్రధానం చేశారు. వడ్డాది గీచిన వందలాది చిత్రాలను సూక్ష్మీకరించి అందంగా తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే.

పక్షి ఈకపై రాహుల్ వేసిన చిత్రాలు

ముగ్గురు విఆర్‌ఒల బదిలీ

లావేరు : మండలంలోని గురుగుబిల్లి, గుమ్మడాం, లక్ష్మిపురం గ్రామాలకు చెందిన ముగ్గురు విఆర్‌ఒలు బదిలీ అయినట్టు తహశీల్దార్ ఎం.రాజశేఖర్ తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నగరవనంతో పర్యావరణ పరిరక్షణ

గార : జిల్లాలో చెట్లు పెంచడం వలన పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం ఎస్.మత్స్యలేశం సముద్రతీరాన్ని అటవీశాఖ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. నగర వనాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు. చెట్ల పెంపకం వలన తీరం కోతకు గురి కాకుండా ఉంటుందన్నారు. పునరుద్ధరించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని వివరించారు. ఆయనతో పాటు జిల్లా అటవీశాఖ అధికారి, అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కవిటి: కవిటి నుంచి సముద్ర తీరానికి చేరుకునే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు తమ వంతుగా సహాయసహకారాలు అందిస్తున్నారు. అందులో భాగంగా కవిటికి చెందిన పొల్లాయి సీతారాం తన వంతుగా సోమవారం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బిపి రెడ్డి, మొగలిపురి సీతారాం, ఆరింగి మధు, పాండవ రామారావు, భావన రవి, జన్ని లోకనాదం, చందాన కోదండరాం, పొల్లాయి రుద్రయ్య, పి హేమాచలం, పి దుర్యోధన పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ప్రజాశక్తి- లావేరు

మహిళలు తమకాళ్లపై నిలబడి స్వయం సమృద్ధి సాధించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ సహకారంతో ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ మూడు నెలలు పాటు ఉంటుందని, రోజుకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. టైలరింగ్ వృత్తి గౌరవ ప్రదమైనదన్నారు. 103 కుట్టు మిషన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, తహశీల్దార్ ఎం.రాజశేఖర్, వెలుగు ఎపిఎం బి.వి.సుబ్బయ్య నాయుడు, మాజీ ఎంపిపి ఎం.వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, అప్పలనాయుడు, మురళీమోహన్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బిసి ఫైనాన్స్ కార్పొరేషన్, ఇడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, డిస్టిక్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన స్పీచ్‌క్రాఫ్ట్ శిక్షణా శిబిరం

ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సమాజంలో ప్రతిఒక్కరూ సానుకూల దృక్పదాన్ని అలవర్చుకోవాలని, తద్వారా యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని జెసిఐ సన్‌రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ సింగూరు అన్నారు. నగరంలోని ప్రైవేటు హోటల్‌లో స్పీచ్‌క్రాఫ్ట్ - 2025 శిక్షణా శిబిరం రెండు రోజులు నిర్వహించారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కమ్యూనికేషన్ నైపుణ్యం, ఆకట్టుకునే రీతిలో మాట్లాడడంపై మెళకువలు వివరించారు. ప్రతిఒక్కరూ పాజిటివ్ దృక్పదాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జోన్ మెంటార్ కె.వి.రావు, ప్రెసిడెంట్ సంతోష్, జోన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కోవే రాష్ట్ర అధ్యక్షులు గీతా శ్రీకాంత్, జెసిఐ వ్యవస్థాపకులు డా.భీమశంకర్, నటుకుల మోహన్, మధుబాబు, బి.దేవభూషణ్, చిట్టి.నాగభూషణం, మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న నాయకులు

విశ్రాంత గృహ నిర్మాణానికి శంకుస్థాపన

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెంలో ప్రయాణికుల విశ్రాంతగృహం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు విడుదల చేశారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ పాల్గొని శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ది సతీష్, జి.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యను వినియోగించుకోవాలి

వజ్రపుకొత్తూరు: ప్రయివేటు విద్యాసంస్థల్లో నిరుపేద విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఇఒ బి.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 28 నుంచి మే 15 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంద న్నారు. పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు దగ్గర్లో ఉన్న సచివాలయాలు, మీసేవ కేంద్రాలు, ఇంటర్నెట్, ఎంఇఒ కార్యాలయంలోనూ చేసుకోవచ్చునని తెలిపారు.

నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

తాగునీరు సరఫరా

పాతపట్నం: మండల కేంద్రం నీలకంఠాపురం, బాలాజీ నగర్ వీధిల్లో నివాసితులకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. టిడిపి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించారు. సోమవారం మామిడి అప్పారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా తాగునీటి ట్యాంకర్‌ను పంపించి నీటిని సరఫరా చేయించారు. దీంతో నివాసితులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్, టౌన్ ప్రధాన కార్యదర్శి అక్కంద్ర సన్యాసిరావు, సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు పాల్గొన్నారు.